సాక్షి నిజామాబాద్

శనివారం । 17 । మే । 2025



అధ్వానంగా ఆటోనగర్

నగర శివారులోని ఇండస్ట్రియల్ కారిడార్ ఆటోనగర్‌ను పట్టించుకునే వారు లేక అధ్వానంగా తయారైంది.

- IIలో ▸



సనాతన ధర్మాన్ని..

హిందువులంతా సనాతన ధర్మాన్ని పాటించాలని హంపీ పీఠాధిపతి విరూపాక్ష విదారణ్య భారతి స్వామి పేర్కొన్నారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
39.8 /23.7

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

అంకాపూర్‌వాసికి జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామానికి చెందిన గంగాదేవి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కే వినోద్ రెడ్డికి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇంటర్నేషనల్‌లో చోటు లభించింది. అంకాపూర్ గ్రామంలో గురడి రెడ్డి కాపు సంఘంలో వినోద్ రెడ్డి శుక్రవారం క్రికెట్, టెన్నిస్, ఫుట్‌బాల్, ఫార్ములా వన్ కారు రేసు, బాక్సింగ్, హాకీ క్రీడలకు సంబంధించిన 1,400 ఫొటోలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా కోర్డినేటర్లు బింగి నరేందర్ గౌడ్, అనిల్ ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. వినోద్ రెడ్డి సేకరించిన ఫొటోలను రికార్డుగా గుర్తించి బంగారు పతకంతోపాటు ప్రశంసాపత్రాన్ని అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ కోర్డినేటర్ రాజు, గురడి రెడ్డి కాపు సంఘం అధ్యక్షుడు సల్ల అనంతు, ఉపాధ్యక్షుడు నారాయణ, సాగర్, నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల కేంద్రం పరిశీలన



నిజామాబాద్ అర్బన్ : నగరంలోని పాఠ్య పుస్తకాల కేంద్రాన్ని డీఈవో అశోక్ శుక్రవారం పరిశీలించారు. జిల్లాకు ఇంకా ఎన్ని పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉంది అనే విషయాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వచ్చిన పాఠ్య పుస్తకాలను వెంటవెంటనే మండల కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. సకాలంలోనే పాఠ్య పుస్తకాలను అందిస్తామని పేర్కొన్నారు.

డ్రోన్ల వినియోగానికి అనుమతి తప్పనిసరి

- సీపీ సాయిచైతన్య




ఖలీల్‌వాడి: డ్రోన్ల వినియోగానికి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సీపీ సాయిచైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం వాటిల్లే అవకాశాలు ఎక్కువగా ఉండడంతో, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వ సంస్థలు, పోలీసులు, ఏవియేషన్ అధికారుల నుంచి క్లియరెన్స్ తీసుకోవాలని సూచించారు. ఎక్కువ శబ్దంతో డీజేలను ఏర్పాటు చేయొద్దని, రెసిడెన్షియల్, కమర్షియల్ స్థలాల్లో రాత్రి వేళ్లలో 55 డెసిబెల్స్ సౌండ్ వాడాలన్నారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు డీజేలపై పూర్తిగా నిషేధం ఉందన్నారు. కమిషనరేట్ పరిధిలో ఊరేగింపులు, బహిరంగ సభలపై నిషేధం ఉందని, సభలు, సమావేశాలకు పోలీసు శాఖ అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. నిబంధనలు ఈనెల 31 వరకు అమలులో ఉంటాయని సీపీ తెలిపారు. ప్రజలు గల్ఫ్ ఏజెంట్లను నమ్మవద్దని, వారికి ఇండ్లు, ఆఫీసులకు అద్దెకు ఇస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పిచ్చుకపైనే బ్రహ్మాస్త్రం!

- కృత్రిమ కల్లు తయారీలో కల్లు సొసైటీలపైనే అధికారుల ప్రతాపం
- కొత్త రకం డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్న మాఫియాకు మినహాయింపు
- 'యాంటీ సైకోటిక్ డ్రగ్స్' వాడకాన్ని ప్రోత్సహిస్తున్న ముదుర్లు
- తక్కువ ఖర్చుతో లభించే రసాయనాల వైపు కొందరి చూపు
- అధికారుల తీరుపై విమర్శలు





రసాయనాల బదులు..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కల్తీకల్లు కోసం ఉపయోగించే రసాయనాలు, కల్లు తయారీదారులను పట్టుకునే విషయంలో అధికార యంత్రాంగం విచిత్రంగా వ్యవహరిస్తోంది. భారీ స్థాయిలో రసాయనాలను సరఫరా చేస్తున్న వారిని, తక్కువ ధరకు లభించే డ్రగ్స్‌ను కల్లు తయారీకి ఉపయోగించేలా ప్రయోగాలు చేస్తున్నవారిని వదిలేసి కల్లు సొసైటీ సభ్యులుగా ఉండి చిన్నపాటి డిపోలను నిర్వహిస్తున్న తమపైనే ప్రతాపం చూపిస్తున్నారని గౌడ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.కోట్లలో వ్యాపారాలు చేస్తూ భారీగా రసాయనాలను రవాణా చేస్తున్న వారిని వదిలేసి పిచ్చుకపై బ్రహ్మాస్త్రం మాదిరిగా తమను ఇబ్బందులపాలు చేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు. కేసుల లెక్కల కోసం ఇలా చేయడం సరికాదంటున్నారు.

కామారెడ్డి జిల్లాలోని నస్రుల్లాబాద్ మండలం దుర్కి గ్రామంలో గతనెల 7వ తేదీన కల్లుడిపోలో కల్లు తాగిన 69 మంది అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఇందులో 17 మందిపై తీవ్ర ప్రభావం చూపడంతో నిజామాబాద్ జీజీహెచ్‌లో 72 గంటలపాటు వైద్య చికిత్సలు అందించారు. చికిత్స సమయంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా లక్షణాలు కనిపించడంతో క్షుణ్ణంగా పరిశీలించిన వైద్యులు.. కల్లు తయారీలో కలిపిన రసాయనాల విషయమై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. బాధితులకు గంటల వ్యవధిలోనే నాడీవ్యవస్థ దెబ్బతినడంతోపాటు నాలుక దొడ్డుగా మారడం, డిస్టోనియా(మరమనిషి మాదిరిగా), రిజిడ్(గట్టిగా), నిరలు పడిపోవడం, నొప్పులు తదితర లక్షణాలు కనిపించాయి. దీంతో కొత్తగా 'యాంటీ సైకోటిక్ గ్రూపు'నకు చెందిన డ్రగ్స్‌ను వాడినట్లు వైద్యులు అనుమానిస్తున్నారు. ఈ యాంటీ సైకోటిక్ గ్రూపులోని డ్రగ్స్‌ను 'మేజర్ మెంటల్ డిజార్డర్' ఉన్నవారికి ఉపయోగిస్తారు. ఈ డ్రగ్ పేషెంట్‌ను కామ్‌డౌన్ చేస్తుంది. అయితే యాంటీ సైకోటిక్ గ్రూపులో క్లోర్‌ప్రామజిన్ లాంటి మరో ఐదు రకాల డ్రగ్స్ ఉంటాయి. ఇలా రసాయనాల బదులు కొత్త రకం డ్రగ్స్‌తో కల్లు ప్రియులపై ప్రయోగాలు చేస్తున్నవారిని వదిలి అధికారులు తమపై ప్రతాపం చూపుతున్నారని సొసైటీల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కల్లుపై ప్రయోగాలు

కృత్రిమ కల్లును గతంలో క్లోరోహైడ్రేట్ రసాయనంతో తయారు చేసేవారు. ప్రభుత్వం నిషేధించాక డైజోఫాం ఉపయోగించారు. ప్రస్తుతం కృత్రిమ కల్లు తయారీకి అల్ప్రాజోలం రసాయనం వాడుతున్నారు. ఈ రసాయనాలు సాధారణంగానే అత్యంత ప్రభావితం చేస్తాయి. దీర్ఘకాలంలో గుండెపోటు, కిడ్నీ, జీర్ణవ్యవస్థ దెబ్బతినడం, జ్ఞాపకశక్తి కోల్పోవడం జరుగుతుంది. ఇక మోతాదు పెంచితే తాగిన వాళ్లు కుప్పకూలాల్సిందే. కాగా ఈ రసాయనాల కొనుగోలు ఖర్చును మరింతగా తగ్గించుకొని, అధిక లాభాలను ఆర్జించేందుకు కొందరు బడా ముదుర్లు కల్లుప్రియులపై ప్రయోగాలు చేసేందుకు వెనుకాడడం లేదని వైద్య నిపుణులు అనుమానిస్తున్నారు. ఇలాంటి బడా ముదుర్లను వదలి తమపై అధికార యంత్రాంగం ప్రతాపం చూపడంపై కల్లు సొసైటీల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వింటాళ్లో అల్ప్రాజోలం రసాయనాన్ని సరఫరా చేస్తున్న వారిని పట్టుకోవడం మాని కేవలం రెండు నుంచి మూడు కిలోలు తెచ్చుకుంటున్న తమపై కేసులు నమోదు చేసి ఉన్నతాధికారుల వద్ద జిల్లా అధికారులు మెప్పు పొందుతున్నారని సొసైటీల సభ్యులు చెబుతున్నారు. అల్ప్రాజోలం విషయానికొస్తే ఉమ్మడి జిల్లాలో 2023లో 6.4 కిలోలు, 2024లో 9.6 కిలోలు, 2025లో ఇప్పటి వరకు 0.25 కిలోలు మాత్రమే పట్టుకోవడం గమనార్హం. ఇదంతా గమనిస్తే బడా ముదుర్లను మాత్రం వదిలేస్తున్నట్లు అర్థమవుతోందని సొసైటీల సభ్యులు అంటున్నారు.

సిద్దాపూర్ పనులు త్వరగా పూర్తిచేయాలి



సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులపై సమీక్షిస్తున్న మంత్రి ఉత్తమ్, చిత్రంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: బాన్సువాడ నియోజకవర్గంలోని సిద్దాపూర్ రిజర్వాయర్ పనులు నాణ్యతాలోపం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సూచించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన బాన్సువాడ నియోజకవర్గంలోని సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులపై ప్రభుత్వ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. వర్ని మండల పరిధిలో రూ.258 కోట్లతో నిర్మిస్తున్న సిద్దాపూర్ రిజర్వాయర్, జాకోర, చందూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై సమావేశంలో చర్చించారు. రిజర్వాయర్ పనులపై కాంట్రాక్టర్, అధికారులు ప్రతి మంగళవారం సమావేశం ఏర్పాటు చేసుకోవాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. పనుల్లో నాణ్యత పాటించాలని, జాప్యం జరగకుండా అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. జాకోర, చందూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. సమీక్షలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, సహాయ కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, కామారెడ్డి ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాభివృద్ధి సంస్థ విత్తనాలనే వాడండి

- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్ రెడ్డి



పచ్చలనడ్కుడలో జీలుగ విత్తనాలు అందజేస్తున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్ రెడ్డి

వేల్పూర్: పుట్టగొడుగుల్లా పెరుగుతున్న ప్రైవేటు సంస్థ విత్తనాలను వాడకుండా ప్రభుత్వ రంగ సంస్థ అయిన విత్తనాభివృద్ధి సంస్థ విత్తనాలనే వాడాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేశ్ రెడ్డి రైతులకు సూచించారు. వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ, మోతె గ్రామాలలో శుక్రవారం ఆయన 50 శాతం రాయితీపై రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలను వాడి యూరియా వాడకాన్ని తగ్గించాలని కోరారు. విత్తనాభివృద్ధి సంస్థ అందించే నాణ్యమైన విత్తనాలు వాడి అధిక దిగుబడి సాధించాలని పేర్కొన్నారు. జిల్లాకు పదివేల క్వింటాళ్ల జీలుగ విత్తనాలను కేటాయించగా, మండలాలకు ఇప్పటికే 7,500 క్వింటాళ్లు సరఫరా చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డం నర్సా రెడ్డి, పచ్చలనడ్కుడ, మోతె, సొసైటీల చైర్మన్లు లింబారెడ్డి, రాజేశ్వర్, ఏడీఏలు సాయికృష్ణ, విజయలక్ష్మి, ఏవో శృతి, కాంగ్రెస్ నాయకులు భగవాన్‌దాస్, సుదర్శన్, రాజేశ్వర్, ఇంద్రాగౌడ్, నర్సారెడ్డి, గంగారెడ్డి, గుడాల మోహన్, టక్కర్ గంగాధర్, జేమ్స్ గంగారెడ్డి, చరణ్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలుపుదాం

- అతి త్వరలో రెండు మైదానాల నిర్మాణ పనులు ప్రారంభిస్తాం
- ఫుట్‌బాల్ టోర్నీ అభినందనీయం
- టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్



మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్

నిజామాబాద్‌నాగారం: క్రీడారంగంలో జిల్లాను అగ్రగామిగా నిలుపుదామని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఉమెన్స్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న తెలంగాణ ఉమెన్స్ లీగ్ ఫుట్‌బాల్ టోర్నీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యా, వైద్యరంగాలతోపాటు క్రీడా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. క్రీడలకు కేరాఫ్‌గా నిజామాబాద్ జిల్లా నిలిచిందని, జిల్లా నుంచి అనేక మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించడం శుభ సూచకమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి క్రీడాకారుడని, అందుకే తెలంగాణలో క్రీడల అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని తెలిపారు. త్వరలోనే ఇందూరులో రూ. 4 కోట్లతో ఇండోర్ స్టేడియం, మరో రూ. 4 కోట్లతో అవుట్‌డోర్ స్టేడియం నిర్మిస్తామన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని ఫుట్‌బాల్ లీగ్ మ్యాచ్‌ను తిలకించారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ టోర్నమెంట్ కన్వీనర్ డాక్టర్ కవితారెడ్డి, చైర్మన్ రాజేందర్ రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నరాల రత్నాకర్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, ఫుట్‌బాల్ కోచ్ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఫుట్‌బాల్ లీగ్ పోటీలో తలపడుతున్న ఇరుజట్ల క్రీడాకారులు

సాఫీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ

- ఇప్పటి వరకు 7.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- మరో 40 వేల మెట్రిక్ టన్నుల వరకు వచ్చే అవకాశం
- మంత్రుల వీసీలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు వెల్లడి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, అధికారులు

నిజామాబాద్ అర్బన్ : జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా సాఫీగా సాగుతోందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు వెల్లడించారు. యాసంగి ధాన్యం సేకరణపై సీఎస్ రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌లతో కలిసి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ శుక్రవారం కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల స్థితిగతులపై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంత్రులకు వివరించారు. యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 4.91 లక్షల ఎకరాలలో వరి సాగు చేయగా, సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చాయని వెల్లడించారు. ఈ సీజన్‌లో 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకొని, 700 పైచిలుకు కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 7.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. మే చివరి వారం నాటికి లక్ష్యానికి మించి మరో 35 వేల నుంచి 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. 460 కేంద్రాలలో ధాన్యం సేకరణ నూరు శాతం పూర్తయ్యిందని, ప్రస్తుతం 260 కేంద్రాల ద్వారా కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం విలువ రూ. 1,839 కోట్లు కాగా, రూ. 1,548 కోట్ల బిల్లు మొత్తాలను రైతుల ఖాతాలలో జమ చేశామని తెలిపారు. 7.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన ట్యాబ్ ఎంట్రీలు పూర్తయ్యాయని తెలిపారు.

రికార్డు స్థాయిలో వరి సాగు : మంత్రి ఉత్తమ్

ఈసారి రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వరి ధాన్యం సాగైందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సన్నరకం వరికి బోనస్ చెల్లించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో 60.14 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, 129.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 8,329 కొనుగోలు కేంద్రాల ద్వారా 70.13 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామని, ఇప్పటికే 49.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలను సేకరించినట్లు వెల్లడించారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెస్తున్నందున కొనుగోళ్ల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. అకాల వర్షాలతో ధాన్యం నిల్వలు తడిసిపోకుండా వాతావరణ పరిస్థితులపై క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ముందస్తుగానే రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు తెలియజేస్తూ అప్రమత్తం చేయాలన్నారు. సన్నబియ్యం పంపిణీలో అవాంతరాలు లేకుండా పర్యవేక్షణ జరపాలన్నారు. కొత్త రేషన్‌కార్డులు, కుటుంబ సభ్యుల పేర్ల నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలిస్తూ మంజూరు చేయాలన్నారు. బోగస్ కార్డులు జారీ కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరాస్వామి, డీఎస్‌వో అరవింద్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం శ్రీకాంత్ రెడ్డి, డీసీవో శ్రీనివాస్, మార్కెటింగ్ శాఖ ఏడీ గంగూబాయి తదితరులు పాల్గొన్నారు.

జింకలు కుక్కల పాలు

- గోదావరి తీరంలో వేటాడి చంపుతున్న వీధి కుక్కలు
- మిన్నకుండిపోతున్న సంబంధిత అధికారులు
- పూర్తిగా తగ్గిపోయిన జింకల సంఖ్య



ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో జింకలను వేటాడుతున్న వీధి కుక్కలు



డొంకేశ్వర్(ఆర్మూర్): శ్రీరాంసాగర్ (ఎస్సారెస్పీ) బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని ఎకో టూరిజం స్పాట్‌గా మారుస్తామని చెబుతున్న ప్రభుత్వం అక్కడ సంచరించే వన్య ప్రాణుల రక్షణను గాలికొదిలేసింది. స్వేచ్ఛగా విహరించే జింకలు, పక్షుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడింది. వీధి కుక్కలు వేటాడి పీక్కు తింటున్నాయి. కళ్లముందే వాటి ప్రాణాలు పోతుంటే శివారు గ్రామ పంచాయతీలు, సంబంధిత శాఖల అధికారులు మిన్నకుండిపోతున్నారు. ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోతే ఎకో టూరిజం ఏర్పాటయ్యే నాటికి జింకలు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది.

వందల నుంచి పదికి..

ఒకప్పుడు వందల్లో కనిపించే జింకలు వీధి కుక్కల కారణంగా ఇప్పుడు పదికి మించి కనిపించడం లేదు. వన్యప్రాణులను చూసేందుకు వెళ్లిన వారికి కుక్కల గుంపులే దర్శనమిస్తున్నాయి. ప్రతి ఏడాది వేసవిలో ఎస్సారెస్పీలో బ్యాక్ వాటర్ తగ్గిపోయి పచ్చిక బయళ్లు ఏర్పడుతాయి. చిన్నయానం, గాదేపల్లి, జీజీ నడ్కుడ, గంగాసముందర్, అన్సారం, సిర్పూర్, నికాల్‌పూర్ గ్రామాల శివార్లలో కిలోమీటర్ల మేర గడ్డితో పచ్చదనం కనిపిస్తుంది. పచ్చికను మేసేందుకు జింకలు బ్యాక్‌వాటర్ ప్రాంతానికి వస్తాయి. ఐదారేళ్ల క్రితం ఎటు చూసినా జింకల మందలు కనిపించేవి. కుక్కల బెడద, సందర్శకుల తాకిడి మొదలైనప్పటి నుంచి జింకలకు ప్రాణభయం మొదలైంది. గ్రామాల్లో ఉండే వీధి కుక్కలు జింకల రుచి మరగడంతో అవి బ్యాక్ వాటర్‌లోనే తిష్టవేశాయి. జింకల పరుగును అందుకోలేని శునకాలు తెలివిగా నలుదిక్కులా మాటు వేసి వేటాడుతున్నాయి. వాటి చేతికి చిక్కిన జింకలు విలవిల్లాడుతూ ప్రాణాలొదులున్నాయి. వర్షాకాలంలో, వరద నీరు వచ్చిన సమయంలో కూడా జింకలు ఒడ్డుకు, పొలాల్లోకి రావడంతో కుక్కలకు సులభంగా చిక్కుతున్నాయి. శివారు గ్రామాల ప్రజలు, మత్స్యకారులు గాయపడిన జింకలను ఊరిలోకి తీసుకొచ్చి అటవీ, పశువైద్యాధికారులతో చికిత్సలు చేయిస్తున్నారు. చనిపోయిన వాటికి అక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. కుక్కలను తరుముతున్నా మళ్లీ వస్తున్నాయని, గ్రామాల్లో దూడలను సైతం దాడి చేసి చంపేస్తున్నాయని స్థానిక ప్రజలు, రైతులు, మత్స్యకారులు వాపోతున్నారు. వాటిని పట్టుకొని ఇక్కడి నుంచి తరలించాలని అధికారులను కోరుతున్నారు. కాగా, బ్యాక్‌వాటర్ ప్రాంతంలో అటవీ శాఖ నుంచి బీట్ ఆఫీసర్ లేక పర్యవేక్షణ కష్టంగా మారింది. బీట్ ఆఫీసర్‌ను నియమిస్తామని ఉన్నతాధికారులు చాలాసార్లు మాట ఇచ్చినప్పటికీ ఎందుకో అది అమలు కావడం లేదు.

> **మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం**
>
> వీధి కుక్కలు జింకలను వేటాడుతున్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఇది వరకే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గ్రామస్తులు, మత్స్యకారులు సాయంతో గాయపడిన జింకలకు చికిత్స అందిస్తున్నాం. కుక్కల సమస్యను పూర్తిగా నివారించడానికి ఉన్నతాధికారుల దృష్టికి మరోసారి తీసుకెళ్తాం. చర్యలు చేపట్టాలని కోరుతాం.
>
> – సుధాకర్, డిప్యూటీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్

సిరికొండ పీహెచ్‌సీలో విచారణ

- వివరాలు సేకరించిన వైద్యారోగ్యశాఖ అడ్మినిస్ట్రేటివ్ అడిషనల్ డైరెక్టర్ శశిశ్రీ



పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న వైద్యారోగ్యశాఖ అడ్మినిస్ట్రేటివ్ ఏడీ శశిశ్రీ

నిజామాబాద్ నాగారం/ సిరికొండ: 'విధులకు డుమ్మా.. రిజిస్టర్‌లో హాజరు' అనే శీర్షికన సాక్షిలో గురువారం ప్రచురితమైన కథనం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఉద్యోగుల అక్రమ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన వైద్యారోగ్యశాఖ డైరెక్టర్ ఆఫ్ హెల్త్(డీహెచ్)..విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని డీఎంహెచ్‌వో రాజశ్రీని ఆదేశించింది. దీంతో గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్‌తో విచారణ చేయించి, డీహెచ్‌కు నివేదిక అందజేశారు. కాగా, ఆ నివేదికతో సంతృప్తి చెందని డీహెచ్ ప్రత్యేక విచారణకు ఆదేశించారు. దీంతో వైద్యారోగ్యశాఖ అడ్మినిస్ట్రేటివ్ అడిషనల్ డైరెక్టర్ శశిశ్రీ శుక్రవారం సిరికొండ పీహెచ్‌సీకి వెళ్లి పూర్తి వివరాలు సేకరించారు. పీహెచ్‌సీలో విధులు నిర్వ హిస్తున్న ఉద్యోగుల స్టేట్‌మెంట్ తీసుకోవడంతోపాటు పీహెచ్‌సీని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఉద్యోగులు విధులకు హాజరుకాకుండా ఏం చేస్తున్నారని మండిపడ్డట్లు తెలిసింది. మంచి జీతాలు ఉన్నా పేదలకు మెరుగైన సేవలు అందించకుండా దుమ్మా లు కొడుతూ దొంగతనంగా రిజిస్టర్‌లో సంతకాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. పర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారని, పీహెచ్‌సీలో ఇలాంటి ఘటనలు జరగడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఉద్యోగి విధులకు రాకున్నా సంతకాలు చేయించి, జీతాలు ఇవ్వడంపై మండిపడ్డారు. ఇదే పరిస్థితి జిల్లాలోని చాలా పీహెచ్‌సీలో జరుగుతున్నట్లు అనుమానాలు వ్యక్తం చేశారు. పూర్తిస్థాయి నివేదికను ఆమె డీహెచ్‌కు అందజేయనున్నారు. అడిషనల్ డైరెక్టర్ వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్, ఇతర అధికారులు ఉన్నారు.

క్లుప్తంగా

గోదాం పరిశీలన



మోర్తాడ్‌: భీమ్‌గల్‌ సహకార సంఘం గోదాంను జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు శుక్రవారం పరిశీలించారు. యూరియా, డీఏపీ నిల్వలను తనిఖీ చేశారు. ఎంపీడీవో సంతోష్‌ కుమార్‌, ఎంపీవో జావిద్‌, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

సీపీని కలిసిన జైలు సూపరింటెండెంట్‌



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనర్‌ కార్యాలయంలోని సీపీ సాయి చైతన్యను శుక్రవారం జిల్లా సెంట్రల్‌ జైలు సూపరింటెండెంట్‌ చింతల దశరథం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పూలమొక్కను ఆయన సీపీ అందజేశారు.

తిరంగా యాత్రలో భాగస్వాములు కావాలి

నిజామాబాద్‌ నాగారం : దేశంలో, రాష్ట్రంలో జరగనున్న తిరంగా యాత్రలో అందరు భాగస్వాములై విజయవంతం చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షులు బుస్సాపూర్‌ శంకర్‌ తెలిపారు. శుక్రవారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ప్రాంతంలో నినాదాలు చేస్తూ, ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం నుంచి జరగనున్న తిరంగా యాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో వీరమరణం పొందిన జవాన్లకు నివాళులు అర్పించాలన్నారు. ఈ సమావేశంలో బీసీ సాధికార సంఘం జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మిర్యాల సురేష్‌ , రాథోడ్‌ సుందర్‌ నాయక్‌ , కొట్టేవార్‌ మారుతి, చంద్రకాంత్‌, ఇందల్వాయి కిషన్‌, రవి శంకర్‌, రేఖ ప్రసాద్‌, బానోత్‌ రామ్‌ దాస్‌, పద్మ, ఆనంద్‌ స్వామి హిమలిత, అయ్యవార్‌ గోపిక లు పాల్గొన్నారు.

అధ్వానంగా ఆటో నగర్‌

- సీసీ రోడ్లు లేక వాహనదారుల ఇబ్బందులు
- పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం
- పట్టించుకోని అధికారులు



మురుగునీటిలోనే వెళ్తున్న వాహనదారుడు



ఆటో నగర్‌లోని రోడ్డుపై నిలిచిన మురుగునీరు

నిజామాబాద్‌ సిటీ: నగర శివారులోని ఇండస్ట్రియల్‌ కారిడార్‌ 'ఆటో నగర్‌'ను పట్టించుకునే వారు కరువయ్యారు. స్థానిక సమస్యలను పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ఆటో నగర్‌ అధ్వానంగా మారింది. కనీస వసతులు లేక, కంకర రోడ్లు, పారిశుధ్య లోపంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలను అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

40 ఏళ్లుగా సమస్యలతో సావాసం..

ఇండస్ట్రియల్‌ పనుల కోసం ప్రత్యేకంగా 1982లో అప్పటి ప్రభుత్వం నగర శివారులో 26 ఎకరాల స్థలం కేటాయించింది. దాని చుట్టూ ప్రహరీ ఏర్పాటుచేసింది. ఇందులో దాదాపు 200 వరకు పలు రకాల ఇండస్ట్రియల్‌ కార్యాలయాలు, వర్క్‌షాపులు ఉన్నాయి. వీటిపై ఆధారపడి దాదాపు 2వేల మంది ఆధారపడి పనులను చేస్తున్నారు. అయితే ఇంత పెద్ద కారిడార్‌లో మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఆటో నగర్‌ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. 40 ఏళ్ల క్రితం చేసిన పనులే తప్ప కొత్తగా ఎలాంటి అభివృద్ధి లేదు. సీసీ డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగునీరు మొత్తం రోడ్ల మీదనే పారుతోంది. చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ కుంటలను తలపిస్తున్నాయి. పాత రోడ్లు పాడైపోయి కంకర తేలి అధ్వానంగా మారాయి. చెత్త సేకరణ జరగడం లేదు. పాడైపోయిన షెడ్‌కు వచ్చిన కార్లు కూడా రోడ్డుమీదనే పార్కు చేస్తున్నారు. దీంతో రోడ్లు ఇరుకుగా మారిపోయాయి.

సమస్యలపై వినతులు..

ఆటోనగర్‌ ఏరియాలో పారిశుధ్య పనులు చేపట్టాలని దుకాణదారులు ఇటీవల మున్సిపల్‌ కమిషనర్‌ దిలీప్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కమిషనర్‌ స్పందించి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, చెత్త సేకరణ చేపడతామని తెలిపారు. వర్షపునీరు బయటకు వెళ్లేలా, సీసీ డ్రెయినేజీల నిర్మాణం కోసం అంచనాలు వేయాలని ఇంజినీరింగ్‌ డీఈ సుదర్శన్‌రెడ్డి, ఏఈ షాదుల్లాను ఆదేశించారు. పారిశుధ్య పనులు చేపట్టాలని అసిస్టెంట్‌ కమిషనర్‌ జయకుమార్‌ను ఆదేశించారు. దీంతో వారు ఆటోనగర్‌ వెళ్లి దుకాణదారులతో మాట్లాడారు. అలాగే ఆటోనగర్‌ అభివృద్ధి కోసం ప్రత్యేక ఫండ్‌ కేటాయించాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీని దుకాణదారులు కోరారు. ఆయన స్పందించి ఎస్టిమేషన్‌ వేయించాలని అధికారులకు సూచించారు. దీంతో త్వరలో సమస్యలు తీరనున్నాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

ఎస్టిమేషన్‌ వేయించాం..

ఆటోనగర్‌ ఇండ్రస్టియల్‌ ఏరియా మున్సిపల్‌ పరిధిలోకి రాదు. దానికి స్పెషల్‌ స్టేటస్‌ ఉంది. అయినా శానిటేషన్‌ పనులు చేయిస్తున్నాం. సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణం, వర్షపునీరు బయటకు వెళ్లేలా ఏర్పాట్ల కోసం అధికారులను పంపి ఎస్టిమేషన్స్‌ వేయించాం.

– దిలీప్‌కుమార్‌, మున్సిపల్‌ కమిషనర్‌

అధికారులు స్పందించాలి..

ఆటోనగర్‌లో మాకు వెల్డింగ్‌ షాపు ఉంది. గత 30 ఏళ్లుగా దుకాణం నిర్వహిస్తున్నాం. ఇక్కడ రోడ్లు, మోరీలు లేవు. తాగునీటి వసతి కూడా లేదు. వర్షం వస్తే రోడ్లన్నీ నీటితో నిండిపోతాయి. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

– షేక్‌ వాజిద్‌ఖాన్‌, ఆటోనగర్‌

దుకాణాలు ఖాళీ చేస్తున్నారు..

మాకు ఇంజినీరింగ్‌ వర్క్స్‌ దుకాణం ఉంది. ఇక్కడ చాలా సమస్యలున్నాయి. ఎవరూ పట్టించుకోవడం లేదు. సరైన సదుపాయాలు లేకపోవడంతో చాలా మంది ఇక్కడ నుంచి దుకాణాలను ఖాళీ చేసి వెళ్తున్నారు. ఆటో నగర్‌ అభివృద్ధికి ప్రభుత్వం నిధులను ఇవ్వాలి.

– సయ్యద్‌ రవూఫ్‌, ఆటో నగర్‌

సమస్యలు పరిష్కరిస్తాం..

ఆటోనగర్‌ ఇండస్ట్రియల్‌ ఏరియాలో సమస్యలు ఉన్నాయనేది వాస్తవమే. దుకాణదారులు మా దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే, అభివృద్ధి పనులను చేపడతాం. వర్షాకాలంలోపే పనులను పూర్తిచేస్తాం.

– శివప్రసాద్‌, జోనల్‌ మేనేజర్‌, ఆటోనగర్‌ ఇండస్ట్రియల్‌ ఏరియా

'రాజీవ్‌ యువవికాసం' ప్రక్రియ వేగవంతం చేయాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రాజీవ్‌ యువవికాసం పథకానికి సంబంధించిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని సెర్ప్‌ డీపీఎం సుధాకర్‌ సూచించారు. మండలకేంద్రంలోని ఎస్‌బీఐ, యూనియన్‌ బ్యాంక్‌ తోపాటు మండలంలోని ధర్మారెడ్డిలో గల తెలంగాణ గ్రామీణ బ్యాంకును శుక్రవారం ఆయన సందర్శించారు. ఈపథకం ద్వారా రుణాలు పొందేందుకు నిరుద్యోగులు చేసుకున్న దరఖాస్తుల పరిశీలనను త్వరగా పూర్తి చేయాలన్నారు. దరఖాస్తులలో రుణాలు పొందేందుకు అర్హత గల లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని మేనేజర్లను కోరారు. ఆయనవెంట నాగిరెడ్డిపేట ఏపీఎం జగదీశ్‌ కుమార్‌ ఉన్నారు.



దరఖాస్తుల పరిశీలనపై మేనేజర్‌తో మాట్లాడుతున్న డీపీఎం సుధాకర్‌

డెంగీ నివారణకు కృషి చేయాలి



నగరంలో ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యశాఖ అధికారులు

నిజామాబాద్‌నాగారం: డెంగీ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రజలందరి భాగస్వామ్యంతోనే వ్యాధి నియంత్రణ జరుగుతుందని జిల్లా మలేరియా అధికారి, నిజామాబాద్‌ డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారం రాథోడ్‌ అన్నారు. నగరంలోని సీతారాంనగర్‌ పట్టణ ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా వైద్య సిబ్బంది పరిసరాలను శుభ్రంగా ఉంచాలి.. నీటి నిల్వలను తొలగించాలి.. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

అనంతరం తుకారం మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం డ్రైడేని విధిగా పాటించాలన్నారు. దోమల నివారణ, కీటక జనిత వ్యాధుల నివారణ కోసం వైద్యశాఖనే కాకుండా ప్రజలందరూ భాగస్వాములైనప్పుడే నివారించవచ్చు అన్నారు. వైద్య సిబ్బంది నవ్య, సహిస్తాహిర్దోష్‌, సలీం, ఘన్పూర్‌ వెంకటేశ్వర్లు, గోవర్ధన్‌, నటరాజ్‌, రవిచందర్‌, సుశీల, శ్యామల, మధుసూదన్‌, స్వామి, శశిరేఖ, సుశీల, కవిత, సంగీత పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని పాటించాలి





రామాలయంలో పూజలు చేస్తున్న హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి

నందిపేట్‌(ఆర్మూర్‌): హిందువులంతా సనాతన ధర్మాన్ని పాటించాలని హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి అన్నారు. నందిపేటలోని రామనగర్‌లో నూతనంగా నిర్మించిన రామాలయంలో శుక్రవారం కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్‌ ఆధ్వర్యంలో హంపీ పీఠాధిపతి కరకములచే యంత్ర, మూర్తి, శిఖర, ధ్వజ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వేద పండితులతో ప్రాణ ప్రతిష్ఠ, శాంతి ప్రతిష్ఠ హోమములు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శాంతి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. హంపీ పీఠాధిపతి మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం ఎంతో శ్రేష్ఠమైనవని, ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

జేఈఈ పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్‌ 163 అమలు

ఖలీల్‌వాడి: జిల్లాకేంద్రంలో ఈనెల 18న జరిగే జేఈఈ (అడ్వాన్స్‌)– 2025 జరుగనుండగా, రెండు పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్‌ఎస్‌ఎస్‌ 163 సెక్షన్‌ అమలు చేస్తున్నట్లు సీపీ సాయిచైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా నిషేధిత ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడరాదన్నారు. నిషేధిత వస్తువులతో పరీక్ష కేంద్రాల వద్ద తిరుగవద్దన్నారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలోని జిరాక్స్‌ సెంటర్లను ఈనెల 18న ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు మూసివేయాలని సూచించారు.

పెన్షనర్ల న్యాయపరమైన సమస్యలు పరిష్కరిస్తా



నిజామాబాద్‌నాగారం: పెన్షనర్లకు న్యాయపరమైన సమస్యలుంటే పరిష్కరించడానికి కృషి చేస్తానని జిల్లా న్యాయసేవ సమితి కార్యదర్శి, జిల్లా సీనియర్‌ సివిల్‌ జడ్జి ఉదయ్‌భాస్కర్‌ తెలిపారు. నగరంలోని న్యాయసేవాధికారి సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఆయనను తెలంగాణ పెన్షనర్స్‌ అండ్‌ రిటైర్డ్‌పర్సన్స్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు కలిసి పలు సమస్యలపై చర్చించారు. పెన్షనర్స్‌–సీనియర్‌ సిటిజెన్స్‌ భవనాన్ని కమ్యూనిటీ మీడియేషన్‌ సెంటర్‌గా గుర్తించినట్లు అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు తెలిపారు. కుటుంబ తగాదాలు, నిర్లక్ష్యానికి గురవుతున్న తల్లిదండ్రులు, వృద్ధులు వారి సమస్యలు, భార్యాభర్తల వివాదాలు, సివిల్‌ తగాదాలు ఇవన్నీ కూడా ఈ మీడియేషన్‌ కేంద్రంలో చర్చించి పరిష్కార మార్గాన్ని చూపిస్తారని, ఇది జిల్లా న్యాయసేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఈవీఎల్‌ నారాయణ, లావు వీరయ్య, జీవన్‌ రావు తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ల బదిలీ

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలో పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణ ఎన్నికల్లో పలువురు తహసీల్దార్లను బదిలీ చేయగా, ప్రస్తుతం వారిని సొంత జిల్లాలకు పంపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాకు వచ్చే తహసీల్దార్లు శ్రీనివాస్‌, సతీష్‌రెడ్డి, ముజీబుద్దీన్‌, ప్రసాద్‌, వీర్‌సింగ్‌, ఇతర జిల్లాలకు వెళ్లే వారు మాలతి, మల్లయ్య, హిమబిందు, జానకి, పెద్దరాజు, నాగార్జున, ప్రభాకర్‌, గజానన్‌, రహిమొద్దీన్‌, సునీత, ఆంజనేయులు ఉన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన డిగ్రీ పరీక్షలు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో శుక్రవారం డిగ్రీ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ సెమిస్టర్‌ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలకు 7189 మంది విద్యార్థులకు గానూ 6709 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 829 మంది విద్యార్థులకు గానూ 724 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. జిల్లా కేంద్రంలోని ఉమెన్స్‌ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని తెయూ రిజిస్ట్రార్‌ యాదగిరి, కంట్రోలర్‌ సంపత్‌ కుమార్‌, ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ చంద్రశేఖర్‌ తనిఖీ చేశారు.

క్రైం కార్నర్‌

ఎండు గంజాయి పట్టివేత



నవీపేట: మండల కేంద్రంలో శుక్రవారం డిస్ట్రిక్ట్‌ టాస్క్‌ఫోర్స్‌ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి ఎండు గంజాయిని పట్టుకున్నారు. రైల్వే స్టేషన్‌, శివాజీ చౌక్‌ సమీపంలో దాడులు చేసి పురుషోత్తం, ఖురేషి చోటుమియాలను సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద సోదాలు నిర్వహించగా ఇద్దరి దగ్గర 200 గ్రాముల చొప్పున ఎండు గంజాయి లభ్యమైంది. నిందితులను అదుపులోకి తీసుకుని ఎస్‌హెచ్‌వోకు అప్పగించారు. టాస్క్‌ ఫోర్స్‌ సీఐ విలాస్‌, ఎస్సై సింధు, సిబ్బంది చంద్రమోహన్‌, నీలిరాజు, కిరణ్‌కుమార్‌, నర్సయ్య చారి, సాగర్‌రావ్‌, సలీమ్‌, భూమేశ్వర్‌, గోపి, కార్తీక్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆవులను ఎత్తుకెళ్లేందుకు యత్నం



ఖలీల్‌వాడి: నగరంలోని ఆకుల పాపయ్య రోడ్డులో శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి ఆవులకు మత్తు ఇంజక్షన్‌ ఇచ్చి ఎత్తుకెళ్లేందుకు యత్నించినట్లు నాలుగోటౌన్‌ ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు. దుండగులు ఉదయం 3.30 గంటల ప్రాంతంలో ఓ ఆవుకు మత్తు ఇంజక్షన్‌ ఇచ్చి కారులో తరలించేందుకు ప్రయత్నించగా స్థానికులు గమనించి కేకలు వేశారు. వెంటనే దుండగులు ఆవును వదిలి కారులో పరారైనట్లు తెలిపారు. ఆవుల యాజమాని అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కేబుల్‌ వైర్ల చోరీ నిందితుడి పట్టివేత

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా గ్రామాల్లోని బోరుబావుల వద్ద కేబుల్‌ వైర్లు దొంగిలిస్తున్న నిందితుడిని స్థానిక రైతులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మండల కేంద్రంలోని మత్తడికిందిపల్లెకు చెందిన ధారావత్‌ రాములు అనే వ్యక్తి గత కొంతకాలంగా బోరు బావుల వద్ద కేబుల్‌ వైర్లు చోరీ చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం బోరు బావి వద్ద కేబుల్‌ వైర్లు చోరీ చేస్తుండగా రైతులు పట్టుకొని మండల కేంద్రానికి తీసుకొచ్చి కేబుల్‌ మెడలో వేసి ఊరేగించారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై ఎస్సై వెంకట్రావును వివరణ కోరగా ధారావత్‌ రాములును రైతులు అప్పగించినట్లు తెలిపారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

మేకలపై చిరుత దాడి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాలోత్‌ సంగ్యా నాయక్‌ తండాలో ఆరు మేకలపై చిరుత దాడి చేసి హతమార్చినట్లు తండావాసులు శుక్రవారం తెలిపారు. తండాకు చెందిన నేనావత్‌ శివరాం, నేనావత్‌ లక్ష్మణ్‌కు చెందిన మేకలు తండా సమీపంలోని గుట్ట ప్రాంతంలో మేతకు వెళ్లాయి. అదే సమయంలో అటవీ ప్రాంతంలో నుంచి వచ్చిన చిరుత ఆరు మేకలపై దాడి చేయగా, మృతిచెందినట్లు బాధితులు తెలిపారు. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి బీట్‌ అధికారి సాయికిరణ్‌ చేరుకొని వివరాలు సేకరించారు. అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

వివాహిత అదృశ్యం

రుద్రూర్‌: పోతంగల్‌ మండలం జల్లాపల్లి పారంకు చెందిన వివాహిత (20) అదృశ్యమైనట్లు ఎస్సై సునీల్‌ శుక్రవారం తెలిపారు. ఈ నెల 11న ఎవరికి చెప్పకుండా ఆమె ఇంటి నుంచి వెళ్లి, ఇప్పటికీ తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో వివాహిత భర్త హైమద్‌ఖాన్‌ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అల్ప్రాజోలం స్మగ్లింగ్‌ గ్యాంగ్‌ అరెస్టు

- రూ.25లక్షల విలువ గల 2.5 కిలోల సరుకు పట్టివేత
- వివరాలు వెల్లడించిన నిజామాబాద్‌ సీపీ సాయి చైతన్య



వివరాలు వెల్లడిస్తున్న సీపీ సాయిచైతన్య

బోధన్‌రూరల్‌: సాలూర మండల కేంద్రంలో ప్రత్యేక నిఘాతో దాడి నిర్వహించి అల్ప్రాజోలం స్మగ్లింగ్‌ గ్యాంగ్‌ను పట్టుకుని రూ.25లక్షల విలువల గల సరుకును స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబాద్‌ సీపీ సాయి చైతన్య అన్నారు. బోధన్‌ సర్కిల్‌ పోలీస్‌ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సాలూరలో అల్ప్రాజోలం స్మగ్లింగ్‌ చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం రావడంతో బోధన్‌ ఏసీపీ శ్రీనివాస్‌, రూరల్‌ సీఐ విజయ్‌, ఎస్సై మచ్చేందర్‌ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. మహారాష్ట్రకు చెందిన అమర్‌సింగ్‌ దేశ్‌ముఖ్‌ (ఏ1), బాబురావు కడేరీ (ఏ2), షబ్బీర్‌ అలీ పాషామీయా చౌదరి (ఏ3), పరమేశ్వర్‌ బర్డాడే (ఏ4), నిజామాబాద్‌ జిల్లాకు చెందిన మల్లెపూల లక్ష్మణ్‌గౌడ్‌ (ఏ5) గురువారం అర్ధరాత్రి కారులో రూ.25లక్షల విలువల 2.5కిలోల అల్ప్రాజోలంను రవాణా చేస్తుండగా పట్టుకున్నామన్నారు. నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి కారు, 8ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో నిందితుడు విశ్వనాథ్‌ శివంకర్‌ (ఏ6) పరారైనట్లు తెలిపారు. బోధన్‌ ఏసీపీ శ్రీనివాస్‌, రూరల్‌ సీఐ విజయ్‌, ఎస్సై మచ్చేందర్‌ రెడ్డి, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడనే హత్య

- ప్రియుడితో కలిసి సహజీవన భాగస్వామిని హతమార్చిన మహిళ
- లింగారెడ్డిపేట వ్యక్తి మిస్సింగ్‌ కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలను వెల్లడించిన ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్‌



మాట్లాడుతున్న సీఐ రవీందర్‌నాయక్‌

ఎల్లారెడ్డి: వివాహేతర సంబంధానికి సహజీవనం చేస్తున్న భాగస్వామి అడ్డు ఉన్నాడని ప్రియుడితో కలిసి మహిళ హతమార్చిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎల్లారెడ్డి మండలంలో చోటుచేసుకున్న ఘటన వివరాలను శుక్రవారం సీఐ రవీందర్‌ నాయక్‌ వెల్లడించారు. ఎల్లారెడ్డి మండలంలోని లింగారెడ్డిపేట గ్రామానికి చెందిన పొలవ్వ భర్త కొన్నేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆమె ఒంటరిగా జీవిస్తుండగా ఎల్లారెడ్డిలోని గాంధీనగర్‌ కాలనీకి చెందిన షేక్‌ అహ్మద్‌ (47)తో పరిచయం ఏర్పడింది. దీంతో అహ్మద్‌ తన భార్య, పిల్లలను వదిలేసి పొలవ్వతో సహజీవనం చేశాడు. కొద్ది నెలల క్రితం పొలవ్వకు సాతెల్లి గ్రామానికి చెందిన కుర్మ సాయిలుతో పరిచయం ఏర్పడింది. సాయిలుతో చనువుగా ఉంటున్న పొలవ్వకు షేక్‌ అహ్మద్‌ అడ్డుగా వస్తున్నాడని భావించి అతడి అడ్డును తొలగించుకోవాలని నిర్ణయించుకుంది. ఈక్రమంలో జనవరి 24న అహ్మద్‌ను ప్రియుడు సాయిలుతో కలిసి ఎల్లారెడ్డి శివారులోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లింది. అనంతరం అతిగా మద్యం తాగిన షేక్‌ అహ్మద్‌ను పొలవ్వ, ప్రియుడు సాయిలు కలిసి గొంతు నులిమి, మర్మాంగాలపై దాడి చేయడంతో మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని అక్కడే పెట్రోల్‌ పోసి తగలబెట్టారు. ఇదిలా ఉండగా అహ్మద్‌ కనబడటం లేదని అదే నెల 28న పొలవ్వ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా పొలవ్వ కాల్‌ డేటా ఆధారంగా కేసును ఛేదించారు. అటవీ ప్రాంతంలో చెల్లాచెదురుగా ఉన్న మృతుడి కళేబరాలను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన ఎస్సై మహేష్‌, పీసీలు ఇద్రిస్‌, సిద్దు, అనిల్‌, హోంగార్డు ప్రసాద్‌లను ఎస్పీ అభినందించారని, వీరికి రివార్డు ఇవ్వనున్నట్లు సీఐ తెలిపారు. నిందితుల వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, వెండి కడియం, టీవీఎస్‌ ఎక్సెల్‌ వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

ఫారెస్ట్‌ అధికారులకు నెమలి అప్పగింత



ఆర్మూర్‌ టౌన్‌: పట్టణంలోని గోల్‌బంగ్లా వద్ద శుక్రవారం నెమలిని కోతులు వెంబడిస్తుండగా స్థానికులు గమనించి, రక్షించారు. అనంతరం వారు నెమలిని పోలీస్‌ స్టేషన్‌కు తీసుకువెళ్లగా, పోలీస్‌లు ఫారెస్ట్‌ అధికారులకు సమాచారం అందించి, వారికి నెమలిని అప్పగించారు. నెమలిని కాపాడిన పోల్కం వేణు, లక్ష్మీనారాయణ, మోహన్‌ను వారు అభినందించారు.

నవీపేటలో ఆటో చోరీ

నవీపేట: మండల కేంద్రంలో శుక్రవారం ఆటో చోరీకి గురైనట్లు ఎస్సై వినయ్‌ తెలిపారు. నవీపేటకు చెందిన మంజుసింగ్‌ తన ఆటోను సంత సమీపంలో పార్కింగ్‌ చేసి ఇంటికి వెళ్లాడు. కొద్దిసేపటికి వచ్చి చూసేసరికి ఆటో లేకపోవడంతో, చోరీకి గురైందని గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఖలీల్‌వాడి: నగరంలోని బస్టాండ్‌ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు నాలుగోటౌన్‌ ఎస్సై శ్రీకాంత్‌ శుక్రవారం తెలిపారు. మృతుడు నీలం రంగు ఫుల్‌ షర్ట్‌ ధరించి ఉన్నారని తెలిపారు. వయస్సు 55నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. గత 3 రోజుల నుంచి ఇక్కడే చుట్టుపక్కల తిరుగుతూ రోడ్డుపై పడుకుంటున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి సంబంధించిన వారు ఎవరైన ఉంటే నాలుగో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో లేదా, ఫోన్‌ నెంబర్‌ 8712659840, 8712659719కు సంప్రదించాలని అన్నారు.

ఒకరి ఆత్మహత్య

నస్రుల్లాబాద్‌(బాన్సువాడ): మండలంలోని దుర్కి గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. దుర్కి గ్రామంలోని మామిడి బాల్‌రాజు(47)కు గత రెండు సంవత్సరాల క్రితం నుంచి మతిస్థిమితం బాగాలేదు. ఎన్ని ఆస్పత్రుల్లో చికిత్స అందించినా నయంకాలేదు. ఈక్రమంలో గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో అతడు ఇంటి వెనక గల పాకలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లగా వైద్యులు పరీక్షించి, మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కామారెడ్డి క్రైమ్‌: జిల్లా కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. జిల్లాకేంద్రంలోని గుమాస్తా కాలనీకి చెందిన గుమ్మడి రాజేందర్‌ (69) డెయిరీఫామ్‌ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం డెయిరీఫామ్‌లో పనులు చూసుకుని ఇంటికి వచ్చేందుకు కామారెడ్డి–రామారెడ్డి ప్రధాన రహదారి దాటుతుండగా వేగంగా వచ్చిన ఓ బైక్‌ అతడిని ఢీకొట్టింది. ఈఘటనలో అతడు తీవ్రంగా గాయపడగా స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య లక్ష్మీ పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.